క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: పుప్పాల్‌గూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సెక్రటేరియట్ కాలనీ, బాలాజీనగర్, శివాలయం రోడ్డు, ఆదిత్య ఫోర్ట్ విల్లాస్ ప్రాంతాల్లోని విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరాను నిలిపేస్తున్నామని ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 1 నుంచి 13 వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రహదారిని పరిశీలిస్తున్న మున్సిపల్ మేయర్, కమిషనర్

బండ్లగూడ: వర్షాల కారణంగా దాత్రినగర్ కాలనీలోని రహదారి గుంతలమయంగా మారడంతో మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్, కమిషనర్ శరత్‌చంద్రతో కలిసి పరిశీలించారు. మంగళవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి సరస్వతి విద్యాపీఠం ముందు నుంచి దాత్రినగర్ కాలనీకి వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వర్షాల వల్ల రహదారి దెబ్బతినడంతో తాత్కాలిక మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. పార్టీ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, డీఈ యాదయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ నిరాహార దీక్షలు



నిరాహార దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు

రాజేంద్రనగర్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 8వ రోజుకు చేరాయి. మంగళవారం ఉదయం ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు స్థానిక మహిళలు, యువకులు, బుద్వేల్ రైతు సంఘం సభ్యులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తెలిపే వరకు తమ దీక్షలు కొనసాగుతాయన్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న మహిళలు

రాజేంద్రనగర్: మహిళా బిల్లుకు కేంద్రం ఆమోదం తెలిపి లోక్‌సభ, రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టడం చారిత్రాత్మకమైన నిర్ణయమని రాజేంద్రనగర్ డివిజన్ పార్టీ ప్రధాన కార్యదర్శి స్వప్నరెడ్డి అన్నారు. మంగళవారం ఉప్పర్‌పల్లిలో ప్రధాని చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా టపాకాయలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 33 శాతం మహిళా రిజర్వేషన్ ఏర్పాటు చేసిన అనంతరం రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో సగానికి పైగా మహిళలు రావడం ఖాయమన్నారు. మహిళాబిల్లును ఆమోదించిన ప్రధానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

పుప్పాల్‌గూడలో ప్రత్యేక పూజలు



రుద్రహోమంలో పాల్గొన్న భక్తులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ కాశీవిశ్వనాథ నల్లపోచమ్మ దేవాలయంలో సోమవారం నుంచి 63 రోజుల పాటు నిర్వహించే రుద్రాభిషేక పూజలను ప్రారంభించారు. మొదటిరోజు లోక కల్యాణార్థం మహారుద్రాభిషేకం, రుద్ర హోమం పూజలను నిర్వహించి మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదానం చేశారు. 63 రోజుల పాటు నిర్విరామంగా జరిగే పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అర్చకులు శాంతికుమార్ శర్మ కోరారు.

వైభవంగా గణనాథుడికి పూజలు

మణికొండ: వినాయక చవితి సందర్భంగా మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో సోమవారం గణనాథుడి నవరాత్రి పూజలను ఘనంగా నిర్వహించుకున్నారు. పోటాపోటీగా కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, కూడలీలు, గృహాలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మామిడి తోరణాలు, రంగురంగుల విద్యుత్ దీపాలు, అరటి కొమ్మలు, అందమైన అలంకరణలతో తీర్చిదిద్దారు. ప్రత్యేక పూజల్లో వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



హైదర్షాకోట్ మేఘన అపార్ట్‌మెంట్‌లో పర్యావరణ హిత మట్టిగణపతి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. డివిజన్ పరిధిలోని 225 గణనాథులను ప్రతిష్టించారు. రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చనాజయప్రకాశ్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రజనీకాంత్‌గౌడ్, పొరెడ్డి ధర్మారెడ్డి, మహేష్, శ్రావణ్, సాయిమాలిక్ తదితరులతో పాటు ఉత్సవ సమితి సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పలు కాలనీలలో వివిధ రూపాల్లో కొలువైన గణనాథులను ఏర్పాటు చేసి ఘనంగా పండగ వేడుకలను నిర్వహించుకున్నారు. బండ్లగూడ జాగీర్ ఓల్డ్ విలేజ్ హనుమాన్ దేవాలయంలో మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఖానాపూర్‌లో జరిగిన పూజల్లో కౌన్సిలర్, మాజీ ఎంపీపీ స్థానికులు



కోకాపేటలో జరిగిన పూజల్లో పాల్గొన్న కౌన్సిలర్ శివారెడ్డి



మణికొండ నవజ్యోతి యూత్ ఆధ్వర్యంలో..



బుద్వేల్‌లో గణేష్ మండపం వద్ద భక్తులు



బండ్లగూడ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్



మంచిరేవుల అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో..



నార్సింగిలో వైస్ చైర్మెన్ వెంకటేష్‌యాదవ్

మహిళలపై చిత్తశుద్ధి ఉంది

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి

మణికొండ: దేశంలోని మహిళలపై బీజేపీకి చిత్తశుద్ధి ఉందని, అందుకే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును కొత్త పార్లమెంట్‌లో మొదటి బిల్లుగా ప్రవేశపెట్టిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలో పార్టీ నాయకులు నిర్వహించిన సంబరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో మహిళలను గుర్తించి తమ పార్టీ, ప్రభుత్వాలు మహిళలకు అత్యవసరమైన మరుగుదొడ్లు, గ్యాస్ కనెక్షన్‌లు, బ్యాంక్ అకౌంట్లను అందించి వారికి అన్ని రకాల భద్రత కల్పించిందన్నారు. ఇతర పార్టీలకు చిత్తశుద్ధి లేక వారిని కేవలం ఓటుబ్యాంకుగానే వాడుకుంటున్నారని విమర్శించారు.

- దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ అనేక బిల్లులను పాస్ చేసుకున్నా.. మహిళా బిల్లును మాత్రం పక్కన పెట్టిందన్నారు. ఇక రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కేవలం 6 మందికి మాత్రమే ఎమ్మెల్యే టికెట్లను ఇవ్వటం వారి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.
- బీజేపీ పార్టీ ఇప్పటి నుంచే మహిళలకు అధికంగా సీట్లు ఇచ్చి వారిని రాజకీయ రంగంలోనూ రాణించేలా సహకారం అందిస్తుందన్నారు.



మణికొండలో సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి, స్వీట్లు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు, మణికొండ మున్సిపల్ వైస్ చైర్మెన్ కె. నరేందర్‌రెడ్డి, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సి.బీరప్ప, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. రాఘవరెడ్డి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సీహెచ్. ఇందిర, కౌన్సిలర్లు బి.శ్వేతారవికాంత్‌రెడ్డి, ఎల్.వందననగేష్, వి.హైమాంజలి అనిల్‌కుమార్, కో- ఆప్షన్ సభ్యురాలు జె.లక్ష్మీరాములు, నాయకులు అనితాదేవి, ఆనంద్‌రావు, నరసింహాచారి తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం



విద్యార్థులకు నీళ్లను అందజేస్తున్న కౌన్సిలర్ శివారెడ్డి

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను మరింత పెంచుతామని కోకాపేట కౌన్సిలర్ జి.శివారెడ్డి అన్నారు. మంగళవారం నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన ఆర్‌ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ నిధులతో పాటు దాతల సహకారాన్ని తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులు మంచి నీటిని తాగినప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ నీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయన్నారు. సంస్థ సీఈఓ లక్ష్మి, సయోద్య ఆర్గనైజేషన్ డైరెక్టర్ మృదుల, ప్రధానోపాధ్యాయులు రాములు, మాధవరెడ్డి, ఎన్‌జీఓ ప్రతినిధి రాంచందర్, సీడీఎఫ్ సంస్థ ప్రతినిధి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ పనులు నిలిపేయాలని వినతి

శంషాబాద్ రూరల్: గ్రామంలో జనావాసాలకు సమీపంలో ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్ పనులు నిలిపేయాలని స్థానికులు పెద్దగోల్కొండ సర్పంచ్ లక్ష్మయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సెల్‌టవర్‌తో వచ్చే రేడియేషన్ కారణంగా గ్రామస్తుల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. సెల్ టవర్లకు ఎలాంటి ప్రాతిపదికన అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. స్థానికులు యాదగిరి, శ్రీనివాస్, శ్రీశైలం, వెంకటేష్, హరి, మిట్టు, తదితరులున్నారు.



సర్పంచ్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలి



టీచర్లకు సంఘీభావం తెలుపుతున్న అశోక్‌యాదవ్

మణికొండ: దశాబ్దాల తరబడి నిత్యం ప్రజలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లను క్రమబద్ధీకరించి, వారి డిమాండ్‌లను ప్రభుత్వం నెరవేర్చాలని నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్ అన్నారు. మంగళవారం నార్సింగిలో నిరహారదీక్ష చేస్తున్న వారికి ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏలు, ఆర్టీసీ కార్మికులను క్రమబద్ధీకరించిన విధంగానే అంగన్‌వాడీ టీచర్లు, కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. నార్సింగి కౌన్సిలర్ ఉషారాణి, అంగన్‌వాడీ టీచర్లు, కార్మికులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

మణికొండ: రాష్ట్రప్రభుత్వం 2018లో రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు నెరవేర్చలేదని, వెంటనే ప్రకటించకపోతే పోరాటానికి సిద్ధం అవుతామని రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మణికొండ రెడ్డి సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని కులాల మాదిరిగానే రెడ్డీల్లోనూ పేదలు ఉన్నారని, వారికి ఎలాంటి ప్రభుత్వ పథకాలు రాకపోవటంతో మరింత పేదరికంలోకి వెళ్తున్నారన్నారు. పేదలకు రూ.5వేల కోట్ల నిధులతో చట్టబద్ధమైన కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని రాష్ట్రప్రభుత్వం అప్పట్లో హామీ ఇచ్చిందన్నారు. హామీని నెరవేర్చకుంటే అక్టోబర్ నెలలో హైదరాబాద్ కేంద్రంగా భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి బీఆర్‌ఎస్ పార్టీకి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. మణికొండ రెడ్డి సంఘం నాయకుడు ఎ.శ్రీపతిరెడ్డిని రాష్ట్ర కమిటీ సభ్యునిగా నియమించారు. ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, రామసుబ్బారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, శివారెడ్డి, బాల వెంకట్‌రెడ్డి, శరత్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



శ్రీపతిరెడ్డిని రాష్ట్ర సంఘం సభ్యుడిగా నియమిస్తున్న జైపాల్‌రెడ్డి

ఘనంగా ఎంపీ రంజిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

మణికొండ: చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల నుంచి పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు, నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మెన్ వెంకటేష్‌యాదవ్, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్.నర్సింహా, రెండు మున్సిపాలిటీల కౌన్సిలర్లు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శంషాబాద్: బీఆర్‌ఎస్ నాయకులు ఎంపీ ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్ మేకల వెంకటేష్ , నాయకులు మంచర్ల శ్రీనివాస్ తదితరులున్నారు.



ఎంపీ రంజిత్‌రెడ్డితో బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి

రాజన్నగుట్టకు భూమి కేటాయించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఖానాపూర్ నాయకులు

మణికొండ: రాజన్నగుట్ట శివాలయానికి అధికారికంగా భూమి కేటాయించి రికార్డుల్లో ఎక్కించాలని నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామస్తులు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, జిల్లా కలెక్టర్, హెచ్‌ఎండీఏ అధికారులను కోరారు. మంగళవారం వారు మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ ఆధ్వర్యంలో వారిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కోకాపేట్ సర్వేనెంబర్ 239,240లలో ప్రభుత్వం వెంచర్‌ను ఏర్పాటు చేసి ఇటీవల 11 ప్లాట్లను విక్రయించిందన్నారు. వాటిలోకి ఏకంగా రాజన్నగుట్ట భూమిని తీసుకుని దేవాలయం వరకు చదును చేసి పనులను చేపట్టారని విమర్శలున్నాయి. ప్రతిఏటా అయ్యప్పస్వాములు ఉండటం, శివరాత్రి పూజలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. అలాంటి దేవాలయానికి భూమిని ఉంచకుండా అమ్ముకోవటం విడ్డూరమన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో సమీక్షించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు కన్నయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్, ఉపాధ్యక్షులు విఠల్‌రెడ్డి, నాయకులు రాజు, మన్నె సురేష్, డాకూరి శ్రీనివాస్, ధన్‌రాజ్, లక్ష్మయ్య తదితరులున్నారు.

వ్యవసాయ వర్సిటీని సందర్శించిన బ్రెజిల్ ప్రొఫెసర్

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని బ్రెజిల్ దేశానికి చెందిన ఫెడరల్ రూరల్ యూనివర్సిటీ ఆఫ్ పెర్నంబుకో అగ్రికల్చర్ బయోడైవర్సిటీ ప్రొఫెసర్ గెర్డాల్ యుజెనియో మంగళవారం సందర్శించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వెంకటరమణతో పాటు ఇతర అధికారులతో సమావేశమై వర్సిటీకి సంబంధించిన పలు విషయాలను తెలుసుకున్నారు. 2014లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటైనప్పటి నుంచి బోధన, పరిశోధన విస్తరణ రంగాల్లో చేపట్టిన చర్యలను రిజిస్ట్రార్ ఆయనకు వివరించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన తర్వాత ప్రభుత్వం సాగునీటి వసతి కల్పనకు పెద్దపీట వేసిందన్నారు. రాష్ట్రంలో వరి పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ ప్రధాన పంటలని తెలిపారు. విద్యార్థులు, ఫ్యాకల్టీ పరస్పర బదిలీ, జన్యు వనరులు, ప్రెసిషన్ అగ్రికల్చరల్ వంటి అంశాల్లో రెండు విశ్వవిద్యాలయాలు పరస్పర సహకారంతో కలిసి పని చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అనంతరం ప్రొఫెసర్ గెర్డాల్ యుజెనియో ఘనంగా సన్మానించారు.



బ్రెజిల్ ప్రొఫెసర్‌ను సన్మానిస్తున్న వ్యవసాయ వర్సిటీ అధికారులు

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



పత్తికుంట వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: వినాయక నిమజ్జనానికి తగిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ అన్నారు. మంగళవారం ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు వై.శ్రీధర్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో పత్తికుంటను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 24 గంటల పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించేలా సిబ్బందిని నియమించామన్నారు. బుధవారం 3వ రోజు కావడంతో ఇళ్లలో ప్రతిష్టించిన గణనాథులను నిమజ్జనానికి తీసుకొస్తారని, వారికి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు చేపట్టామన్నారు. కుంటలోకి ఎవరూ వెళ్లకుండా సిబ్బందిని నియమించామని, సిబ్బందే విగ్రహాలను నిమజ్జనం చేస్తారని వివరించారు. విద్యుద్దీపాల ఏర్పాటుకు విద్యుత్‌శాఖ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో భద్రత మరింత పెరిగిందన్నారు. భక్తులు నిమజ్జనానికి పత్తికుంటకు వచ్చిన సమయంలో సిబ్బందికి సహకరించాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

శంషాబాద్: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆర్బీనగర్‌కాలనీలో గుర్తు తెలియని వృద్ధుడు (65) పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్పృహలో లేని సదరు వ్యక్తిని పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతిచెందాడని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్లను బెదిరించిన వ్యక్తుల అరెస్ట్



శంషాబాద్ రూరల్ : లారీలను ఆపి వినాయకుల తరలింపు కోసం రావాలని డ్రైవర్లను బెదిరించిన యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని రామంతాపూర్, అత్తాపూర్, జియాగూడ, గుడిమల్కాపూర్ ప్రాంతాలకు చెందిన 16 మంది యువకులు మంగళవారం తెల్లవారు జామున బెంగళూరు జాతీయ రహదారిపై వెళ్తున్న లారీలను బలవంతంగా ఆపారు. వినాయకుల తరలింపు కోసం రావాలని ఒత్తిడి చేయడంతో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు గమనించారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపారు. చట్ట వ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఆర్టీసీ బస్సుల ఢీ.. తప్పిన ప్రమాదం

మణికొండ: రెండు ఆర్టీసీ బస్సులు ఢీ కొనడంతో అందులోని ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. చిలుకూరు బాలాజీ దేవాలయం నుంచి మెహిదీపట్నానికి వెళ్తున్న బస్సులు నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధి కాళీ మందిర్ దేవాలయం వద్దకు రాగానే ఒకదానికి మరొకటి వెనక నుంచి ఢీ కొట్టాయి. ఈ ప్రమాదంలో బస్సుల అద్దాలు పగిలిపోవటంతో ప్రయాణికులు భయాందోళనకు గురైయ్యారు. భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆర్టీసీ అధికారుల నుంచి తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పాత దుస్తులు దానమివ్వండి

సాక్షి, సిటీబ్యూరో: నిరుపేదల సహాయార్థం.. ప్రముఖ ఎన్‌జీఓ నిర్మాణ్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్‌లో 'బైగాన్ ఫ్యాషన్ డొనేషన్ డ్రైవ్'ను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా నగరవాసులు మాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌లో తమ దగ్గర ఉన్న వినియోగంలో లేని దుస్తులను విరాళంగా ఇవ్వవచ్చునని, బదులుగా, ఐఎస్-రివార్డ్స్ లాయల్టీ ప్రోగ్రామ్ ద్వారా 100 వరకూ ఐఎస్ నాణేలు పొందవచ్చునని వివరించారు. ఈ డ్రైవ్ అక్టోబర్ 5 వరకూ కొనసాగుతుందన్నారు.

కృత్రిమ మేధస్సుతో ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ నిర్ధారణ



అకియో ఎబిహారాను సత్కరిస్తున్న సీబీఐటీ ప్రిన్సిపాల్ నరసింహులు

మణికొండ: క్యాన్సర్‌లలో ప్రాణాంతకమైన దిగా ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ నిలుస్తుందని, దాన్ని కృత్రిమ మేధస్సు(ఏఐ)తో నిర్ధారించే పరిశోధనలు కొనసాగుతున్నాయని, ప్రపంచ ప్రఖ్యాత ప్రొటీన్ సైన్స్ నిపుణులు ప్రొఫెసర్ అకియో ఎబిహారా అన్నారు. సీబీఐటీలో ఆయన ఏఐతో ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ నిర్ధారణ అంశంపై మాట్లాడారు. అమెరికా లాంటి దేశాల్లోనే మనుగడ రేటు 11 శాతం ఉందన్నారు. ఈ క్యాన్సర్ వచ్చిన రోగుల్లో కామెర్లు, అలసట, పేగు అలవాట్లలో మార్పు, అజీర్ణం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. రోగ నిరూపణను మెరుగుపరచడంలో కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రారంభ స్క్రీనింగ్ కీలక అంశంగా నిలుస్తుందన్నారు. మల్టీ ఓమిక్స్, పాథాలజీలో ఏఐ పాత్ర, కంప్యూటర్ టెక్నాలజీ, బయోటెక్నాలజీతో రోగ నిర్ధారణను సులభతరం చేయవచ్చన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీవీ నరసింహులు, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ అషాతోష్ పాండే, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీలు ప్రారంభం

మణికొండ: జిల్లా స్థాయిలో అండర్-14, అండర్-17 రెజ్లింగ్ పోటీల్లో బాల, బాలికలు రాణించాలని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కస్తూరి యాదయ్య, నార్సింగి మున్సిపాలిటీ వైస్‌చైర్మెన్ వెంకటేష్‌యాదవ్‌లు అన్నారు. మంగళవారం నార్సింగిలో జిల్లాస్థాయి పోటీలను వారు ప్రారంభించారు. రెజ్లింగ్ అతిపురాతనమైన క్రీడ అని, రాణిస్తే మంచి ఉద్యోగాలు, శారీరక ధారుఢ్యం, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. ఇలాంటి క్రీడల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించి జీవితంలో స్థిరపడిన క్రీడాకారులు వందలాది మంది ఉన్నారన్నారు. జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



రెజ్లింగ్ పోటీలను ప్రారంభించిన యాదయ్య, వెంకటేష్‌యాదవ్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230